# సంక్షేమం కావాలంటే జగనన్నే రావాలి

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- అన్ని మండలాల్లో చురుగ్గా సాగుతున్న వై ఏపీ నీడ్స్ జగన్
- సంక్షేమ బోర్డులు, జెండాల ఆవిష్కరణ



ఐరాల: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

**ఐరాల:** పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాలంటే ఆంధ్రప్రదేశ్‌కి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే రావాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు స్పష్టం చేశారు. పాలకల–1 సచివాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి, పేదలకు వివిధ పథకాల ద్వారా జగనన్న అందించిన లబ్ధిని వివరించారు. ప్రజా సంక్షేమానికి అనుగుణంగా సీఎం జగనన్న సంక్షేమ పథకాలను రూపొందించడమే కాకుండా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందజేయడంలోనూ సఫలీకృతులయ్యారన్నారు. వలంటీర్ వ్యవస్థ అందుకు ఎంతగానో దోహదపడుతుందని గుర్తుచేశారు. అనంతరం సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఇప్పటి వరకు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించిన పథకాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ మోహన్, సర్పంచ్ వసంత, మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీఓ నాగరాజు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

**బంగారుపాళెంలో..**

**బంగారుపాళెం:** మండ కేంద్రంలోని సచివాలయం పరిధిలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ ప్రసంగించారు. అనంతరం గ్రామ సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందించిన వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉమాదేవి, ఉపసర్పంచ్ కామరాజు, ఎంపీటీసీ సభ్యురాలు ఉషా, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సర్దార్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ దుర్గాప్రసాద్, గ్రామ కార్యదర్శి శంకరయ్య, అవంతిక, వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు పాల్గొన్నారు.

**సంక్షేమం అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం**

**పూతలపట్టు:** సంక్షేమం అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని యం.బండపల్లిలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని సర్పంచ్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి మండలపార్టీ కన్వీనర్ హాజరై ప్రసంగించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, రాజారత్నంరెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యతీష్, ఎంపీడీఓ గౌరి పాల్గొన్నారు.

**అభివృద్ధి చేసింది జగనన్నే**

**యాదమరి:** రాష్ట్రాని అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది సీఎం జగనన్నే అని ఎంపీపీ సురేష్‌బాబు అన్నారు. రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని మండలంలోని కాశిరాళ్ల సచివాలయ పరిధిలో నిర్వహించారు. సచివాలయం వద్ద గ్రామస్తులకు సమావేశం ఏర్పాటు చేసి జగనన్న ఇచ్చిన హామీలను అమలు చేసిన తీరును వివరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందించిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, మండల వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, నాయకులు సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

**జగనన్న పథకాలను వివరిద్దాం**

**చిత్తూరు రూరల్:** గత నాలుగున్నరేళ్లలో ఈ రాష్ట్రానికి జగనన్న ఏం చేశారో ప్రజలకు చెబుదామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్యాగరాజులు అన్నారు. చిత్తూరు మండలం చింతలగుంట సచివాలయ పరిధిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, నాగేంద్రరెడ్డి, కోదండ రెడ్డి, ప్రసాద్‌నాయుడు, చంద్ర, గోవిందస్వామి మండడి, జేజీరెడ్డి, విజయనాయుడు, జ్ఞానశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యం**

**తవణంపల్లి:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమౌతుందని ఎమ్మెల్యే ఎం.ఎస్. బాబు అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని అరగొండ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిదారుల డిస్‌ప్లేబోర్డును ప్రారంభించి, మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సి.హరిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాంఆజాద్, ఈఓఆర్‌డీ కుమార్, పార్టీ నాయకులు కిషోర్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి పాల్గొన్నారు.

**సీఎం జగన్‌తోనే సంక్షేమం**

**గుడిపాల:** వినూత్నపాలన, నూతన సంస్కరణలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారు కాబట్టే ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుతున్నారని గుడిపాల ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య తెలిపారు. 197రామాపురం సచివాలయంలో బుధవారం వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, జెండాను ఆవిష్కరించారు. రాత్రి అక్కడే బసచేశారు. గ్రామంలో గల పెద్దలతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జనార్దన్, ఎంపీటీసీ శ్రీదేవి, జేసీఎస్ కన్వీనర్ సాయి, సర్పంచ్‌లు రజినీకాంత్, మోహన్ పాల్గొన్నారు.







పూతలపట్టు: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు, బంగారుపాళెం: మాట్లాడుతున్న కుమార్ రాజా, యాదమరి: గ్రామాల్లో పర్యటిస్తున్న ఎంపీపీ సురేష్‌బాబు, జంబుగోళంపల్లె: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు, గుడిపాల: ప్రసంగిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

## క్లుప్తంగా

### కుట్టుమిషన్ల వితరణ



మహిళలకు కుట్టు మిషన్ అందజేస్తున్న నిర్వాహకులు

**చిత్తూరు రూరల్:** నగరంలోని ఇరువారం ప్రాంతంలో ఉన్న పేదలు, వితంతువులకు బుధవారం జోయాలుక్కాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు వితరణ చేశారు. నిరుపేద మహిళలకు చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతో ఆరు నెలల క్రితం 25 మందిని శిక్షణ కోసం ఎంపిక చేశారు. వారికి శిక్షణ కాలం పూర్తయిన నేపథ్యంలో ఫౌండేషన్ నిర్వాహకులు కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ దేవదాసన్, సీఎంఎస్ఎస్ డైరెక్టర్ మనోహర్, నళిని తదితరులు పాల్గొన్నారు.

### నేడు పాలకలలో వై ఏపీ నీడ్స్ జగన్

**ఐరాల:** మండలంలోని పాలకల–2 సచివాలయంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

**జంబువారిపల్లెలో..**

**బంగారుపాళెం:** మండలంలోని జంబువారిపల్లె గ్రామ సచివాలయంలో గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంపై గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు.

### బిర్సాముండాకు నివాళి



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

**చిత్తూరు కార్పొరేషన్:** స్వాతంత్ర్య సమరయోధుడు గిరిజన ఆరాధ్యుడు బిర్సాముండా జయంతి వేడుకలను బుధవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, రాష్ట్ర ఈసీ మెంబర్, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న పల్లిశెట్టి దామోదరరావు

**చిత్తూరు రూరల్:** ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను త్వరితగతిన అందించాలని ఈయూ రాష్ట్ర అధ్యక్షులు పల్లిశెట్టి దామోదరరావు అన్నారు. నగరంలోని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఆయన బుధవారం జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వాయిదా పద్ధతిలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నాం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రక్షిత

**గుడిపాల:** ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ రష్మిత అన్నారు. పేయనపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం గర్భిణులు, షుగర్ పేషెంట్లకు వైద్యం చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 66 మంది రోగులకు చికిత్సలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రెజ్వాన, అనపూర్ణ, శిరీషా, శశి పాల్గొన్నారు.

### పూతలపట్టు ఎస్ఐగా రాంభూపాల్



**పూతలపట్టు:** మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌కు నూతన ఎస్ఐగా రాంభూపాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్థానంలో పనిచేసిన ఎస్ఐ సురేష్ బదిలీపై పలమనేరుకు వెళ్లారు. బంగారుపాళెం ఎస్ఐగా ఉన్న రాంభూపాల్ పూతలపట్టుకు బదిలీపై వచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలో అధికంగా గంజాయి కేసులు నమోదవుతున్నాయని, వాటిపై ప్రత్యేక నిఘా పెడతామని చెప్పారు.

# టీబీ వార్డు భవనానికి రూ.1.79 కోట్లు మంజూరు



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ రవిప్రభు

**తిరుపతి తుడా:** రుయా ఆసుపత్రిలోని టీబీ వార్డు నూతన భవన నిర్మాణానికి రూ.1.79 కోట్లను టీటీడీ పాలకమండలి కేటాయించడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు తెలిపారు. ఆయన బుధవారం డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రుయాలోని టీబతీ వార్డు భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఈ సమస్యను రుయా అభివృద్ధి వర్కింగ్ కమిటీ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్‌తో కలిసి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. టీటీడీ బోర్డు సమావేశంలో రూ.1.79 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. రాయలసీమ పెద్ద ఆసుపత్రిగా సేవలందిస్తున్న రుయా అభివృద్ధికి సహకరించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నాడు–నేడు కింద సుమారు రూ.450 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. రూ.23.75 కోట్లతో 50 పడకల సామర్థ్యంతో క్రిటికల్ కేర్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే అక్యూట్ కేర్ నూతన బ్లాక్‌ను రూ.26.91 కోట్లతో చేపట్టినట్లు తెలిపారు.

# పల్లె ముంగిట్లో వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

**ఐరాల:** ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా పల్లె ప్రజలకు ఇంటి వద్దనే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మొరంపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ 85 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయికి టేకుమంద విద్యార్థులు



రాష్ట్ర స్థాయిఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**బంగారుపాళెం:** మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు బుధవారం హెచ్‌ఎం అబ్దుల్‌సుభాన్ తెలిపారు. అండర్–17 బాలికల విభాగంలో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు నిఖిత, హస్మిత ప్రతిభ చాటి జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నట్లు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా కాకినాడలో గురువారం నుంచి నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

# ఇద్దరు మహిళలు అదృశ్యం

**చిత్తూరు అర్బన్:** నగరంలో ఇద్దరు మహిళల అదృశ్యంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ భారతి తెలిపారు. నగరానికి చెందిన యామిని(20) డిగ్రీ చదువుతోంది. ఈమె అన్నతో కలిసి బజారువీధిలో షాపింగ్‌కు వచ్చింది. షాపులో వస్తువు కొనుగోలు చేస్తున్న సమయంలో యామిని అదృశ్యమైంది. రాజస్థాన్‌కు చెందిన నేతాజీ సింగ్‌కు ఓ షూమార్ట్‌లో పనిచేస్తున్నాడు. ఈయనకు ఆరు నెలల క్రితం కాంచన్‌బెన్(19)తో వివాహమైంది. సుందరయ్యవీధిలో కాపురముంటున్నారు. అయితే ఈనెల 13వ తేదీ ఇంట్లో నుంచి కనిపించకుండా పోయింది. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# సమస్యల పరిష్కారంపై దృష్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు

**తవణంపల్లె:** ప్రజా సమస్యలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గీతారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలపై చర్చించుకోవడానికి ఈ సమావేశం మంచి వేదిక అన్నారు. కానీ సభ్యులు ఆ దిశగా ప్రయత్నం చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సభ్యులు మాత్రమే సమావేశానికి హాజరుకావాలని, మిగతావారు రాకూడదని తెలిపారు. మండలంలో పూర్తయిన భవనాలు, సిమెంటు రోడ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. గడప గడపకు కార్యక్రమంలో మంజూరైన పనులను యుద్ధప్రాతిపదిపక పూర్తి చేయాలన్నారు. ఎంపీపీ గీతారెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు సహకరించాలని కోరారు. గాజులపల్లె వద్ద సబ్‌స్టేషన్ మంజూరై ఏడాదైనా పనులు ఎందుకు ప్రారంభించలేదని ఈచేనేరి సర్పంచ్ ఉమామహేశ్వర రెడ్డి అధికారులను నిలదీశారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ మాట్లాడుతూ మండలంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు భారతి, వైస్ ఎంపీపీ శోభారెడ్డి, ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, వ్యవసాయాధికారి ప్రవీణ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మెరిట్ స్కాలర్‌షిప్‌నకు 42 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ బద్రినారాయణ

**చిత్తూరు కలెక్టరేట్:** తమ కళాశాలలో చదువుతున్న 42 మంది విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ మెరిట్‌స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారని ఆర్‌కే.విద్యాలయ, జూనియర్ కళాశాల కరస్పాండెంట్ బద్రినారాయణ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం అభినందించారు. ప్రిన్సిపల్ రమేష్ బాబు మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన ఒక్కో విద్యార్థికి ఐదేళ్లపాటు స్కాలర్‌షిప్ అందజేస్తారని చెప్పారు. డిగ్రీ, బీటెక్, స్థాయిలో మూడేళ్ల వరకు ప్రతి ఏటా రూ.10 వేలు అందజేస్తారన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు ప్రతిఏటా రూ.20 వేలు అందిస్తారని తెలిపారు.

### కలెక్టర్‌ను కలిసిన బీసీ కార్పొరేషన్ ఈడీ



**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా బీసీ కార్పొరేషన్ నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవి కలెక్టర్‌ను కలిశారు. ఆమె బుధవారం కలెక్టర్ షణ్మోహన్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరికీ అందేలా చర్యలు చేపడుతానన్నారు. అనంతరం ఆమె ను ఆ శాఖ లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు.

### టీకాలపై అవగాహన

**యాదమరి:** గ్రామీణ ప్రజలకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించాలని యాదమరి ప్రభుత్వాస్పత్రి వైద్యులు అనిల్‌కుమార్ నాయక్ వైద్య సిబ్బందిని కోరారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ఉన్న చంటి పిల్లలకు, గర్భవతులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఆయన వైద్య సిబ్బందికి సూచించారు.

### పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



బంగారుపాళెం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు

**బంగారుపాళెం:** విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధనుంజయరాజు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవడం ద్వారా విషయపరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు. విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయంలో ఉన్న దిన, వార పత్రికలు చదవాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయంలో సభ్యత్వం పొందితే నిబంధనల ప్రకారం పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదివిన తరువాత తిరిగి అందజేసే సౌలభ్యం ఉందని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామకృష్ణ, లీలావతి పాల్గొన్నారు.

# అయ్యప్ప దర్శనానికి వేళాయె!

- నేడు తమిళ కార్తీక నెల ప్రారంభం
- శబరిమలై అయ్యప్ప ఆలయంలో తొలిపూజ



అయ్యప్పస్వామి పడి పూజలో మాలధారణ భక్తులు (ఫైల్)

**యాదమరి:** శబరిమలై అయ్యప్ప స్వామి దర్శనానికి సమయం రానే వచ్చింది. తమిళ కార్తీక నెలలో స్వామివారి ఆలయాలు తెరిచి దర్శనానికి అనుమతిస్తారు. హరి హర సుతుడు నిత్య బ్రహ్మచారి అయిన అయ్యప్ప స్వామి దీక్షలు తమిళ కార్తీక మాసం ఆరంభం (2023 నవంబర్ 16న) గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. చిత్తూరు జిల్లా తమిళనాడు సరిహద్దులో ఉండడంతో తమిళ కార్తీక నెల మొదటి రోజు అయ్యప్ప మాలధారణ చేపట్టి మండల దీక్షకు ఉపక్రమిస్తారు. అనంతరం ఇరుముడులు ధరించి యాత్రగా కేరళలోని శ్రీ శబరి మలై అయ్యప్పను దర్శించుకుంటారు. అయ్యప్ప భక్తులు స్వామివారి వర్చువల్ క్యూలో ఆన్‌లైన్‌లో తమ టికెట్లను నమోదు చేసుకొని దీక్షలకు సిద్ధమయ్యారు.శబరిమలైలో కార్తీక నెల మొదటి రోజు స్వామివారిని దర్శించుకోవడానికి జిల్లా నుంచి వేలాదిమంది భక్తులు యాత్రకు బయలుదేరారు.

**ప్రారంభం కానున్న మండల దీక్షలు**

అయ్యప్ప మండల దీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. నేటి నుంచి డిసెంబర్ 25 వరకు మండల పూజ దర్శనాలు కొనసాగుతాయి. అనంతరం శబరిమలైలో డిసెంబర్ 25వ అర్ధరాత్రి తరువాత ఆలయం మూసివేస్తారు. మళ్లీ జనవరి 1 నుంచి ఆలయం తెరిచి మకర జ్యోతి పూజలు ప్రారంభిస్తారు. ఈ పూజాది కార్యక్రమాలకు హాజరు కావడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళతారు.

**అయ్యప్ప భక్తుల నియమాలు**

- తమిళకార్తీక నెల మొదటి రోజు మాల ధరించి మండలం అనగా 41 రోజులపాటు దీక్ష ఆచరించాలి.
- ప్రతి దినం సూర్యోదయం ముందు, సూర్యాస్తమయం తరువాత చన్నీటి శిరస్నానం ఆచరించి స్వామికి దీపారాధన చేసి శరణుఘోష పఠించాలి.
- మాలధారణ భక్తులు విధిగా బ్రహ్మచర్యం పాటించాలి.
- మద్యం తాగరాదు, మాంసాహారం, మత్తు పదార్థాలు సేవించరాదు, కాళ్లకు చెప్పులు ధరించరాదు.
- ముఖ, నఖ సౌందర్యానికి ప్రాధాన్యత ఇవ్వరాదు.
- ఎట్టి సమయంలో మెడలో ఉన్న అయ్యప్ప మాలను తీయరాదు.


**భక్తి ప్రపత్తులతో దీక్షను పాటించాలి**



కేరళలోని శబరిమలైలో మాలధారణ చేసి, దీక్షావ్రతం ఆచరించాను. అక్కడే పూజలు చేశాను. అయ్యప్ప దీక్ష నియమాలు కఠినంగా పాటించాలి. మాల ధరించే భక్తులు భక్తితో వుండాలి. 41 రోజుల దీక్షలో భక్తితో వేకువజామున సాయంత్రం సంధ్యవేళ నదీస్నానమాచరించి ఆలయాలలో పూజలు చేయాలి. ఎవరినీ హేళన చేయరాదు. కనీసం అర మండలం (21 రోజుల)పాటు మాలధారణ దీక్షలో వుండాలి. ఈ దీక్ష ఆరోగ్యాన్ని ప్రసాదించే వరం.

–రామచంద్ర గురుస్వామి, యాదమరి మండలం

**ఏటా అయ్యప్ప దీక్ష చేస్తున్నా**



ప్రతి సంవత్సరం అయ్యప్ప దీక్ష చేపడుతున్నా. కరోనా కాలంలో కూడా శబరిమలైకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నాను. గత 30 సంవత్సరాలుగా తమిళ కార్తీక నెల ప్రారంభం రోజు అయ్యప్ప మాల ధరించి దీక్షలు చేపట్టి పలు గ్రామాల్లో అంబలం పూజలు చేసి 40 మంది భక్తులతో వెళ్లి దర్శనం చేసుకుంటున్నా. చాలా సంతోషంగా ఉంది.

–అక్కుల రమేష్‌బాబు, గురుస్వామి, యాదమరి